
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం, 6, అక్టోబర్, 2025



సోమశిలలో 72.508 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 72.508 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 9,245 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నానదికి 2,650, ఉత్తర కాలువకు 100, కండలేరుకు 4 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,21,310
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.10,945
3 శాతం జీఎస్టీతో	రూ.11,273
నవర (8 గ్రా)	రూ.90,184

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.1 /27.5

జిల్లాలో సోమవారం ఉరుములు, మెరుపుల వాతావరణం ఉండి, అక్కడక్కడ పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. ఆది వారం గాలిలో తేమ 55 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

నేడు స్వర్ణభారత్ ట్రస్టుకు వెంకయ్యనాయుడు రాక

వెంకటాచలం: మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సోమవారం వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్టుకు రానున్నారు. సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు రేణిగుంట ఎయిర్‌పోర్ట్ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి సాయంత్రం 4 గంటలకు స్వర్ణభారత్ ట్రస్ట్‌కు చేరుకుంటున్నారు. ఈ నెల 8న రాత్రి 7 గంటలకు నగరంలోని కస్తూరిదేవిగార్డెన్‌లో జరగనున్న బీజేపీ నేత అలూరి ప్రసాద్‌నాయుడు కుమార్తె వివాహానికి హాజరై తిరిగి స్వర్ణభారత్ ట్రస్ట్‌కు చేరుకుంటారు. 9వ తేదీన ఉదయం 11.30 గంటలకు రోడ్డు మార్గాన రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకుని హైదరాబాద్‌కు వెళ్తారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నెల్లూరురూరల్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు తమ అర్జీలను అధికారిక వెబ్‌సైట్ meekosam. ap. gov. in ద్వారా నమోదు చేసుకోవచ్చని, అర్జీ స్థితి, ఇతర వివరాలకు సంబంధించి సమాచారం కోసం నేరుగా 1100 కాల్ సెంటర్‌ను సంప్రదించాలని కోరారు. అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై రౌండ్ టేబుల్ సమావేశం నేడు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరై నిర్మాణాలు జరుపుకున్న మెడికల్ కళాశాలలను నేటి కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించేందుకు చర్యలు చేపట్టడంపై అన్ని పార్టీలు, ప్రజాసంఘాలతో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని మాజీ మంత్రి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న హోటల్ డీఆర్ ఉత్తమ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందన్నారు. మెడికల్ కళాశాలలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిపితే పేద ప్రజలకు మేలు జరుగుతుందా? లేదా ప్రైవేటీకరిస్తే మేలు జరుగుతుందా? అనే అంశం ప్రాధాన్యంగా చర్చ జరుగుతుందన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో భక్తులు గోగర్భం డ్యామ్ వరకు బారులు తీరారు. శనివారం అర్ధరాత్రి వరకు 83,380 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 32,275 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.71 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లోనే దర్శనమవుతోంది. ఈ క్రమంలోనే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళితే క్యూలోకి అనుమతించమని స్పష్టం చేసింది.

దసరా బస్ దోపిడీ

2 నుంచి 3 రెట్లు పెంచిన ట్రావెల్స్ యాజమాన్యాలు

దసరా పండగ వేళ ప్రైవేట్, ట్రావెల్స్ భారీ దోపిడీకి పాల్పడుతున్నాయి. సుదూర ప్రాంతాల్లో ఉన్న వారంతా సొంతూళ్లకు చేరుకుని కుటుంబ సమేతంగా పండగను జరుపుకోవడం ఆనవాయితీ. పండగ ముందు తర్వాత టికెట్ల దోపిడీ యథేచ్ఛగా జరుగుతోంది. బహిరంగంగానే వెబ్‌సైట్‌లో టికెట్ ధరలు రెండు నుంచి మూడు రెట్లు అధికంగా నిర్ణయించినా ప్రభుత్వం, రవాణాశాఖాధికారులు స్పందించకపోవడంతో ట్రావెల్స్ దోపిడీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు అయింది. బతుకుదెరువు నిమిత్తం దూర ప్రాంతాల్లో ఉంటున్న సామాన్య, మధ్య తరగతి ప్రజలు కనీసం పండగ రోజు అయినా కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడపడానికి రావాలంటే జేబులు ఖాళీ చేసుకుంటున్నారు.

- రేపటి నుంచి విద్యాసంస్థలు పునః ప్రారంభం
- హైదరాబాదు, బెంగళూరుకు క్యూకడుతున్న జిల్లా వాసులు
- తిరుగు ప్రయాణంలో ట్రావెల్స్ టికెట్ దందా
- బహిరంగంగానే వెబ్‌సైట్‌ల్లోనే టికెట్ల ధరల పెంపు
- ధరలు పెంచినా రవాణా అధికారులు మొక్కుబడి తనిఖీలు



పెంచిన చార్జీలు ఇలా ...

ప్రాంతం	ఏసీ స్లీపర్		నాన్ ఏసీ స్లీపర్		నాన్ ఏసీ	
	సాధారణ	పెరిగిన ధర	సాధారణ	పెరిగిన ధర	సాధారణ	పెరిగిన ధర
హైదరాబాద్	రూ.1500	రూ.3- 4 వేలు	రూ.1150	రూ.2 నుంచి 2,500 వేలు	రూ.850	రూ.1600
బెంగళూరు	రూ. 1000	రూ.3- 4 వేలు	రూ. 900	రూ.2,500 నుంచి రూ.3 వేలు	రూ. 800	రూ. 2 వేలు
వైజాగ్	రూ. 1600	రూ.3 వేలు	రూ. 1000	రూ.1600 నుంచి రూ.2 వేలు		

నెల్లూరు (టౌన్): దసరా పండగ సామాన్య ప్రజల జేబులకు చిల్లు పడితే.. ట్రావెల్స్, రవాణాశాఖాధికారుల ఖజానాలు నిండుతున్నాయి. తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులతో సొంతూళ్లకు వచ్చి సరదాగా గడిపిన జిల్లా వాసులకు తిరుగు ప్రయాణంలో చుక్కలు కనబడుతున్నాయి. దసరా పండగ నేపథ్యంలో విద్యా సంస్థలకు దాదాపు 14 రోజుల పాటు సెలవులు ఇచ్చారు. దీంతో హైదరాబాద్, బెంగళూరుల్లో ఉంటున్న విద్యార్థులు, చిరు ఉద్యోగులు, బతుకు దెరువు నిమిత్తం వెళ్లిన వలసవాసులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కుటుంబ సమేతంగా సొంతూళ్లకు వచ్చారు. సోమవారం నుంచి విద్యా సంస్థలు పునః ప్రారంభం కానుండడం, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు విధులకు హాజరుకావాల్సి ఉండడంతో ఆదివారం తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యారు. దీంతో హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం ప్రాంతాలకు వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు యాజమాన్యాలు 2 నుంచి 3 రెట్లు చార్జీలు పెంచేసి అమాంతంగా దోచేస్తున్నారు. పెంచిన టికెట్ల ధరలను బహిరంగంగానే వెబ్‌సైట్‌ల్లో పెట్టి దోచుకుంటున్నా.. రవాణా అధికారులు కనీసం స్పందించకపోవడం శోచనీయం. మొక్కుబడిగా ఒకటి.. రెండు ట్రావెల్స్‌కు జరిమానాలు విధించి చర్యలు తీసుకున్నామని చెప్పడం చూస్తే రవాణా అధికారుల వ్యవహారంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి.

డబుల్ చార్జీలు వసూలు

నెల్లూరు నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, వైజాగ్ తదితర ప్రాంతాలకు ప్రతి రోజు 80కు పైగా వీ కావేరి, కే కావేరి, కే బసెస్, శ్రీకృష్ణ, ఆరెంజ్, మార్నింగ్‌స్టార్, తులసి, విక్రమ్ తదితర ప్రైవేట్ బస్సులు తిరుగుతుంటాయి. సోమవారం నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల్లో విద్యాసంస్థలను పునః ప్రారంభించనున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకున్న ప్రైవేట్ యాజమాన్యాలు టికెట్ల ధరలను రెట్టింపు ధరలు నిర్ణయించి ప్రయాణికుల నుంచి ముక్కుపిండి దోచుకుంటున్నారు. రైళ్లకు సైతం డిమాండ్ ఉండడంతో రెండు మూడు రోజుల ముందే టికెట్లను బుక్ చేసుకుండడంతో ప్రైవేట్ యాజమాన్యాలు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. సగం సీట్లను బ్లాక్‌లో పెట్టి మిగిలిన సగం మాత్రమే ఆన్‌లైన్‌లో చూపిస్తున్నారు.

మొక్కుబడి తనిఖీలతో రవాణా అధికారులు

పండగ పేరు చెప్పి అధిక చార్జీలు వసూలు చేస్తున్నా.. ప్రైవేట్, ట్రావెల్స్ బస్సులపై రవాణాశాఖ అధికారులు మొక్కుబడి తనిఖీలతో సరిపుచ్చుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బహిరంగంగానే టికెట్ల ధరలను ఆన్‌లైన్ ఉంచినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని చెబుతున్నారు. తనిఖీల సమయంలో అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని నిర్ధారణ అయినా నామ మాత్రంగా జరిమానాలు విధించి వదిలి వేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అధిక చార్జీలు వసూలు చేస్తున్న బస్సులను సీజ్ చేసిన పరిస్థితి ఎక్కడా లేదు. కేవలం అపరాధ రుసుం విధింపులకే పరిమితవుతున్నారని చెబుతున్నారు. అధిక చార్జీల వసూళ్లపై రాష్ట్ర రవాణాశాఖ ఉన్నతాధికారులు ఆదేశిస్తే తప్ప జాతీయ రహదారులపై రవాణా అధికారులు తనిఖీలు చేసిన సందర్భాలు లేవు. ఇప్పటికైనా పెంచిన చార్జీలను తిరిగి ప్రయాణికుల ఖాతాల్లో జమ చేసే విధంగా చర్యలు చేపడితే కానీ ట్రావెల్స్ యాజమాన్యాల్లో మార్పు రాదంటున్నారు.

రూ.3 లక్షల జరిమానా విధించాం

ప్రైవేట్, ట్రావెల్స్ వాహనాల్లో అధిక చార్జీలపై ఇప్పటికే యాజమాన్యాలను హెచ్చరించాం. పండగ ముందు గత నెల 28వ తేదీ నుంచి కూడా తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే జిల్లా నుంచి వెళ్లే బస్సులకు సంబంధించి రూ.3 లక్షల వరకు జరిమానా విధించాం. మరో రెండు.. మూడు రోజుల పాటు కూడా తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటాం.

– చందర్, రవాణా శాఖ ఉప కమిషనర్

విర్రవీగే టీడీపీ నేతలు, పోలీసులూ జాగ్రత్త

- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే మీ పరిస్థితి.. మీ ఊహకే..
- మా కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదు
- కాకాణి గోవర్ధన్‌రెడ్డి హెచ్చరిక



విలేకరులతో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: 'టీడీపీ నేతల అరాచకాలకు అంతే లేకుండా పోతుంటే.. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారు. తమ పార్టీ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేసే విధంగా విర్రవీగే టీడీపీ నేతలు, పోలీసులు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఉంటే మంచిది. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే మీ పరిస్థితి ఏమిటో మీ ఊహకే వదిలేస్తున్నాం. మా పార్టీ కార్యకర్తల జోలికి వస్తే మాత్రం సహించేది లేదని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. ఇటీవల టీడీపీ మూకల దాడిలో గాయపడిన సోత్‌ఆములూరు వైఎస్సార్‌సీపీ నేత వేముల శ్రీనివాసులును ఆదివారం కాకాణి పరామర్శించారు. కాకాణి మాట్లాడుతూ టీడీపీ నేతలు అధికార మదంతో కక్ష సాధింపు, కవ్వింపు చర్యలకు పాల్పడుతూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారన్నారు. శాంతిభద్రతలను నియంత్రించాల్సిన పోలీస్ యంత్రాంగం అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులు ఒత్తుతూ మరింత దిగజారిపోతున్నారని విమర్శించారు. రౌడీషీటర్లు మితి మీరి ప్రవర్తిస్తూ సామాన్యులపై, ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులను ముమ్మరం చేశారన్నారు. టీడీపీ మూకల దాడిలో తీవ్రంగా గాయపడి స్పృహలేని స్థితిలో ఉన్న పార్టీ కార్యకర్త వేముల శ్రీనువాసులు చేత పోలీసులు బలవంతంగా సంతకాలు పెట్టించుకొని దాడి చేసిన వారిపై మొక్కుబడిగా కేసులు నమోదు చేసి, దాడి గురైన వ్యక్తిపై అట్రాసిటీ కేసులు బనాయించడం ఎంత వరకు సబబన్నారు. వైఎస్సార్‌సీపీలో బలంగా ఉన్న నాయకులు, కార్యకర్తలను పోలీసులతో ఏదో విధంగా భయపెట్టి లొంగదీసుకోవాలనే ప్రయత్నం టీడీపీ నేతలు చేస్తున్నారన్నారు. అధికారం ఉందని విర్రవీగే టీడీపీ నాయకులకు, వారికి కొమ్ముకాస్తున్న అధికారులు, పోలీసులు ఒళ్లు జాగ్రత్తగా పెట్టుకోవాలన్నారు. అధికారం శాశ్వతం కాదని వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత అరాచకాలు సృష్టించిన టీడీపీ నాయకులు కావచ్చు, అధికారులు కావచ్చు పడే పాట్లు ఎంత దారుణంగా ఉంటాయంటే వారి ఊహకు కూడా అందని విధంగా ఉంటాయన్నారు. జగనన్న చెప్పిన విధంగా తప్పు చేసిన అధికారులు, బదిలీ అయినా, పదవీ విరమణ చేసినా, సప్త సముద్రాల అవతల ఉన్నా లాక్కొని వచ్చి శిక్ష విధించడం ఖాయమన్నారు. జగనన్న ముఖ్యమంత్రి కాగానే డిజిటల్ బుక్‌లో నమోదైన ప్రతి ఒక్కరిపై విచారణ చేసి అన్యాయం చేసిన వారిని, అందుకు సహకరించిన అధికారులకు కచ్చితంగా శిక్షపడేలా చూస్తామన్నారు. ఇప్పటికైనా ఎస్పీ జిల్లాలో అమాయకులపై జరుగుతున్న దాడులపై పక్షపాత వైఖరితో కాకుండా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాకాణి డిమాండ్ చేశారు. లేని పక్షంలో వైఎస్సార్‌సీపీ న్యాయపోరాటం చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ కష్టకాలంలో జెండాను భుజాన మోసిన సర్వేపల్లి నియోజకవర్గంతో పాటు జిల్లా వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా నిలుస్తామన్నారు. అనంతరం అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న మద్దెన వెంకట సుబ్బానాయుడును పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి ఐసనాక రమేష్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్, జెడ్పీటీసీ సభ్యులు ఎంబేటి శేషమ్మ, మండల ఉపాధ్యక్షుడు చెరుకూరు శ్రీనివాసులనాయుడు, పార్టీ నాయకులు టంగుటూరు పద్మనాభరెడ్డి, గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి, మన్నెం చిరంజీవులగౌడ్, మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, మారంరెడ్డి బుజ్జిరెడ్డి, చెరుకూరు సరళమ్మ, టంగుటూరు సురేష్ రెడ్డి, ఉండాల వంశీకృష్ణారెడ్డి, చిల్లకూరు ప్రవీణ్‌రెడ్డి, తూపిలి ఉదయ్‌రెడ్డి, లేబూరు మల్లి, రంగినేని కిరణ్, కిశోర్ పాల్గొన్నారు.

జిల్లాకు స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర అవార్డులు

నెల్లూరు (అర్బన్): పరిశుభ్రతకు సంబంధించి జిల్లాకు రాష్ట్ర స్థాయిలో రెండు అవార్డులు, జిల్లా స్థాయిలో 48 అవార్డులు దక్కాయి. ఈ అవార్డులను ఇన్‌చార్జి మంత్రి ఫరూఖ్ చేతుల మీదుగా అందించేందుకు జిల్లా అధికారులు సోమవారం కస్తూర్బా కళాక్షేత్రంలో ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర స్థాయి అవార్డులకు సంబంధించి బెస్ట్ స్వచ్ఛత వారియర్స్ కింద నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన టి.పద్మావతికి, 50 వేల లోపు జనాభా ఉన్న ఆత్మకూరు మున్సిపాలిటీకి స్వచ్ఛతా మున్సిపాలిటీ కింద అవార్డులు దక్కాయి. జిల్లాకు సంబంధించి బెస్ట్ స్వచ్ఛతా గ్రీన్ అంబాసిడర్స్ కింద కొడవలూరు గ్రామ పంచాయతీకి చెందిన కళాయి ఆదిలక్ష్మి, జమ్మవరానికి చెందిన గంగపట్ల చిన్నకోటయ్య, పిడతా పోలూరుకు చెందిన అడపాల వెంకట కృష్ణయ్య, చెల్లాయపాళెంకు చెందిన గరికపాటి మధు, వింజమూరు పంచాయతీకి చెందిన ఎస్.రాములకు అవార్డులు దక్కాయి. బెస్ట్ స్వచ్ఛతా ఎన్‌జీఓలుగా కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డుకు చెందిన ఏఐడీ ఎన్‌జీఓ, స్థానిక రవీంద్రనగర్‌కు చెందిన జీడబ్ల్యూపీపీఎఫ్‌-ట్రస్ట్ శానిటేషన్ ఎన్‌జీఓ సంస్థలకు అవార్డులు దక్కాయి. బెస్ట్ స్వచ్ఛతా వారియర్స్‌గా, బెస్ట్ అంగన్‌వాడీ కేంద్రాలుగా, బెస్ట్ గ్రామ పంచాయతీలు, ఉత్తమ పరిశ్రమలు, స్వచ్ఛత మున్సిపాలిటీలు, స్వచ్ఛతా రెసిడెన్షియల్ పాఠశాలలు, బెస్ట్ ఆస్పత్రులు ఇలా పలు రంగాల్లో ఈ అవార్డులు దక్కాయి.

రోడ్డెక్కిన సచివాలయ ఉద్యోగులు

- ఆత్మగౌరవ నిరసన కార్యక్రమాలను అడ్డుకున్న పోలీసులు
- ప్రభుత్వం, పోలీసులకు ఎందుకు ఉలికిపాటు అంటూ నిలదీత



పోలీసు అధికారులతో ఉద్యోగులు వాగ్వాదం



వీఆర్సీ మైదానంలో నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు



టౌన్‌హాల్ గేట్లకు తాళాలు వేసిన దృశ్యం

నెల్లూరు (పొగతోట): తమ న్యాయమైన డిమాండ్లతోపాటు ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని కాపాడాలంటూ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు ఆదివారం చేపట్టిన ఆత్మగౌరవ నిరసన కార్యక్రమాలను పోలీసులు అడ్డుకున్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యకార్యాచరణ కమిటీ, నెల్లూరు జేఏసీ ఆధ్వర్యంలో పుర మందిరంలో (టౌన్‌హాల్) ఆత్మగౌరవ సభ జరగనీయకుండా భారీగా మోహరించిన పోలీసులు ప్రాంగణం గేట్లకు తాళాలు వేశారు. కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించేందుకు సిద్ధమైన ఉద్యోగులను పోలీసులు అడ్డుకున్నారు. ఎస్పీ, కలెక్టర్ బంగ్లాల వద్దకు వెళ్లి వినతిపత్రం ఇచ్చేందుకు అనుమతి కోరినా నిరాకరించారు. ర్యాలీకి అనుమతి లేదని, ఐదుగురు మాత్రమే వెళ్లేందుకు అనుమతిస్తామంటూ స్పష్టం చేశారు. దీంతో ఉద్యోగులు మండుటెండలో మట్టి నేలపై కూర్చొని నిరసన తెలిపారు. గంటల తరబడి ఎండలో ఉండడం, కాలకృత్యాలు తీర్చుకొనేందుకు వీలు లేకపోవడంతో మహిళా ఉద్యోగులు నానా అవస్థలు పడ్డారు. ఉద్యోగులు, నాయకులను ఎటు వైపు కదలనీయకుండా ఉగ్రవాదులను, తీవ్రవాదులను, రౌడీమూకలను, సంఘవిద్రోహ శక్తులను కట్టడి చేసినట్లు కట్టడి చేశారు. దీంతో మధ్యాహ్నం ఒంటి గంట వరకు నేలపై కూర్చొని నిరసన కొనసాగిస్తూ పోలీసుల వైఖరి, జిల్లా అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ నేతల తీరును వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రభుత్వంతోపాటు పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. తమ నిరసన కార్యక్రమాలపై ఎందుకు ఉలికిపడుతుందని నిలదీశారు. ప్రధానంగా ఉద్యోగుల సమస్యలు, ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు, ప్రొబేషన్ కాలంలో రావాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్స్, ప్రొబేషన్ డిక్లరేషన్, 9 నెలలు ఆలస్యంగా చేసినందున, తొమ్మిది నెలల బకాయిలు, 6 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగోన్నతుల కల్పించాలని, అడ్వాన్స్ ఆటోమేటిక్ స్కీమ్ ద్వారా అదనపు ఇంక్రిమెంట్, సీనియారిటీ జాబితా, నిర్దిష్టమైన జాబ్ చార్ట్, అంతర్ జిల్లాల బదిలీలు, ఇంటింటి సర్వేల నుంచి విముక్తి కల్పించాలంటూ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు గత కొన్ని రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తున్నారు. తమ ప్రధాన డిమాండ్లు పరిష్కారానికి ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించాలని కోరుతూ జేఏసీ నాయకులు మధుబాబు, జగదీష్, హరీష్, పాండు, సురేంద్ర, బాలాజీనాయక్, శ్రీనివాసులురెడ్డి, సతీష్‌రెడ్డి, బాలాజీనాయక్, జయశ్రీ, మేఘన, సురేంద్ర, వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.

ఉద్యోగుల ఆత్మగౌరవం దెబ్బతింది

– బి.మధుబాబు, జేఏసీ చైర్మన్



ఉద్యోగుల సమస్యల సాధన కోసం అన్ని జిల్లాల్లో ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నాం. అన్ని జిల్లాల్లో సభకు అనుమతి ఇచ్చారు. నెల్లూరు జిల్లాలో పోలీసులు సభను అడ్డుకోవడం దుర్మార్గం. ముందుగా అనుమతి ఇచ్చి సభ నిర్వహణ సమయంలో ఉద్యోగులను టౌన్‌హాల్ నుంచి బయటకు పంపించి, గేట్లకు తాళాలు వేయడం దుర్మార్గమైన చర్య. ఇటువంటి తీరు ఎక్కడా చూడలేదు.

ఉద్యోగుల ఐక్యత ఏమిటో నిరూపిస్తాం

– పిల్లి హరీష్, జేఏసీ ప్లానింగ్ సెక్రటరీ



పోలీసుల తీరుతో ఉద్యోగుల ఆత్మగౌరవం దెబ్బతింది. సభకు అనుమతించి తర్వాత నిరాకరించడం ఉద్యోగుల మనోభావాలు దెబ్బతినేలా చేశాయి. సచివాలయ ఉద్యోగులందరూ రాష్ట్ర స్థాయిలో ఐక్యంగా ముందుకు సాగుతాం. సచివాలయ ఉద్యోగుల ఐక్యతేమిటో రాష్ట్ర ప్రభుత్వానికి చాటి చెబుతాం. గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల సాధన కోసం జేఏసీ నిరంతరం శ్రమిస్తోంది.

ర్యాలీకి అనుమతించకపోవడం శోచనీయం

– పాండు, నెల్లూరు జేఏసీ నేత



గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవ సభకు ముందుగా పోలీసుల అనుమతి కోరాం. తొలుత అనుమతిచ్చినప్పటికీ తర్వాత నిరాకరించడం వెనుక ప్రభుత్వ పెద్దల ఆదేశాలు ఉన్నాయని నమ్ముతున్నాం. ఉద్యోగులను మండుటెండలో రోడ్డుపై నిలబెట్టడం దుర్మార్గం. తమ సమస్యలను అధికారులకు చెప్పుకొనేందుకు ర్యాలీ నిర్వహణ కోసం అనుమతి ఇవ్వకపోవడం శోచనీయం. పోలీసుల తీరు దారుణం.

ఉద్యోగుల పరిస్థితులు అత్యంత దారుణం

– రజని, సచివాలయ ఉద్యోగి



గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల పరిస్థితులు అత్యంత దారుణంగా ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 17 సర్వేలు నిర్వహించాం. ఇంటింటా సర్వే పేరుతో రోజూ ప్రజల ఇళ్ల చుట్టూ తిరుగాల్సివస్తోంది. అతి తక్కువ వేతనాలతో ప్రజలకు సేవలందిస్తున్నాం.

క్లుప్తంగా

వేర్వేరు ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు


నవాబుపేటలో మంటల్ని ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నెల్లూరు(క్రైమ్): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు వేర్వేరు ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు జరిగాయి. రూ.80 వేల ఆస్తి నష్టం వాటిల్లింది. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరులోని ఇస్కాన్ టెంపుల్ సమీపంలో సుబ్బమ్మ, వెంకయ్య దంపతులు ఉంటున్నారు. ఆదివారం వారు ఇంట్లో ఉండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దంపతులు బయటకు పరుగులు తీశారు. పూరిల్లు కావడంతో మంటలు దట్టంగా వ్యాపించాయి. ఇన్‌చార్జి ఏడీఎఫ్ఓ శ్రీనాథ్‌రెడ్డి ఆదేశాలతో లీడింగ్ ఫైర్‌మెన్ చంద్రశేఖర్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మంటల్ని ఆర్పేశారు. రూ.50 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

- నవాబుపేటలో జగన్‌మోహన్ నివాసముంటున్నారు. అతని ఇంటి వెనుకున్న గదిలో పాత సామగ్రి, చెక్క వస్తువులున్నాయి. ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటల్ని ఆర్పేశారు. రూ.30 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిసింది.

రైలు కిందపడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరు వేదాయపాళెం రైల్వే గేటు సమీపంలో నెల్లూరు వైపు వచ్చే పట్టాలపై ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మృతుడి వయసు 45 నుంచి 50 ఏళ్లలోపు ఉండొచ్చని భావిస్తున్నారు. ఎరుపు రంగు హాఫ్ హ్యాండ్స్ చొక్కా, నలుపు రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. సిబ్బంది సమాచారం మేరకు నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఆమె కేసు నమోదు చేశారు.

స్నేహితులతో వెళ్లి..

- అదృశ్యమైన బాలుడు
- ఆచూకీ కనుగొన్న పోలీసులు, గ్రామస్తులు


బాలుడితో గ్రామస్తులు, పోలీసులు

సోమశిల: ఓ బాలుడు అడవిలో అదృశ్యమయ్యాడు. అతని ఆచూకీ కోసం గ్రామస్తులు, పోలీసులు గాలించి గుర్తించిన ఘటన ఆదివారం అనంతసాగరం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని ఆమనిచిరివెళ్ల గ్రామానికి చెందిన కూసుపాటి కొండయ్య కుమారుడైన వెంకటకృష్ణ పదో తరగతి చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి గ్రామానికి సమీపంలో ఉన్న అటవీ ప్రాంతానికి వెళ్లాడు. భోజనాల తయారు చేసేందుకు కట్టెల కోసం వెళ్లి తిరిగిరాలేదు. అక్కడున్న యువకులు గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించారు. అందరూ ఘటనా స్థలానికి చేరుకుని గాలించారు. పల్లిపాడు గ్రామం వద్ద బాలుడి ఆచూకీ లభ్యమైందని ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఎటువంటి హాని కలగకుండా వెంకటకృష్ణ బయటపడటంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

రాళ్లపాడు ప్రాజెక్ట్‌లో మృతదేహం

లింగసముద్రం: రాళ్లపాడు ప్రాజెక్ట్‌లో గుర్తుతెలియని మృతదేహాన్ని ఆదివారం గుర్తించారు. పోలీసుల కథనం మేరకు.. కొత్త స్పిల్‌వే పాత గేట్లకు మధ్యలో ఉన్న జనరేటర్ రూమ్ వద్ద నీటిలో మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న ఎస్సై నారాయణ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. మృతుడి వయసు సుమారు 50 సంవత్సరాలు ఉండొచ్చని భావిస్తున్నారు. ప్రాజెక్ట్‌లో నీరు లోతుగా ఉన్నందున బోటు సాయంతో మృతదేహాన్ని బయటకు తీసే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని బయటకు తీస్తేనే ఇది హత్య, ఆత్మహత్యా అనేది నిర్ధారణ అవుతుందని పోలీసులు వెల్లడించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ : రూ.138
లేయర్ : రూ.117
బ్రాయిలర్ చికెన్ : రూ.246
స్కిన్‌లెస్ చికెన్ : రూ.270
లేయర్ చికెన్ : రూ.200



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.40
సన్నవి : రూ.25
పండ్లు : రూ.15



విద్యాశాఖలో బదిలీలలు

- అంతర్ జిల్లాల ట్రాన్స్‌ఫర్స్‌లో అక్రమాలు
- ఇతర జిల్లాల నుంచి 21 మంది టీచర్ల రాక
- ఇక్కడి నుంచి ఇతర జిల్లాలకు 23 మంది
- మరో ఇద్దరి బదిలీకి నేరుగా ప్రభుత్వం ఉత్తర్వులు
- చక్రం తిప్పిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలు తీసుకున్నట్లు ఆరోపణలు

ఉపాధ్యాయుల అంతర్ జిల్లాల బదిలీల్లో పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలున్నాయి. కూటమి నాయకుల జోక్యంతో అర్హులకు అన్యాయం జరిగిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చక్రం తిప్పినట్లు తెలిసింది. కొందరు టీచర్ల నుంచి రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల చొప్పున తీసుకుని రికమండ్ చేసినట్లు సమాచారం.

నెల్లూరు(టౌన్): ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించారు. పాత నెల్లూరు జిల్లా నుంచి 21 మంది ఇతర జిల్లాలకు వెళ్లారు. వీరిలో 17 మంది ఎస్జీటీలు, నలుగురు స్కూల్ అసిస్టెంట్లున్నారు. అదే విధంగా ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి 23 మంది టీచర్లు వచ్చారు. వీరిలో 18 మంది ఎస్జీటీలు, ఐదుగురు స్కూల్ అసిస్టెంట్లున్నారు. వీరందరూ జిల్లా విద్యాశాఖాధికారికి రిపోర్ట్ చేయగా ఆయా స్థానాలు కేటాయించారు.

ఇద్దరికి స్పెషల్ ఆర్డర్లు

మ్యూచువల్, స్పౌజ్‌తో సంబంధం లేకుండా ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయుల బదిలీకి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీఓ జారీ చేసింది. ఈ విషయంలో పెద్దఎత్తున డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలున్నాయి. కోట మండలం మల్లాం జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో పనిచేస్తున్న ఓ మహిళా టీచర్‌ను నెల్లూరు నగరం దర్గామిట్టలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌కు, పెళ్లకూరు మండలం నెలబల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పనిచేస్తున్న ఓ మహిళా టీచర్‌ను కోవూరులోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌కు బదిలీ చేశారు. ఈ బదిలీలు అక్రమంగా జరిగినట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వమే నేరుగా ఉత్తర్వులు జారీ చేయడమేమిటని ప్రశ్నిస్తున్నారు.


నెల్లూరులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం

డబ్బులిచ్చి..

మ్యూచువల్, స్పౌజ్ అవకాశమున్న వారికి అంతర్ జిల్లాల బదిలీలు నిర్వహిస్తారు. జిల్లాలో పనిచేస్తున్న టీచర్, మరో జిల్లాలో పనిచేస్తున్న వారు మ్యూచువల్‌పై బదిలీ చేయించుకునే అవకాశాన్ని కల్పించారు. అయితే ఈ విషయంలో కొందరు అక్రమాలకు తెరలేపారు. కూటమి నేతల జోక్యం ఎక్కువైంది. పలువురు పెద్ద మొత్తంలో డబ్బులిచ్చి బదిలీలు చేయించుకున్నారని ప్రచారం ఉంది. జిల్లాకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి కొందరికి అనుకూలమైన ప్రాంతాల్లో పోస్టింగ్ ఇప్పించారన్న ఆరోపణలున్నాయి. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావును వివచారణ కోరగా మ్యూచువల్, స్పౌజ్‌లకు సంబంధించి బదిలీల్లో అక్రమాలు జరగలేదన్నారు. ఇద్దరు ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం నుంచి నేరుగా ఆర్డర్లు వచ్చాయన్నారు.

నిలిచిన 104 సేవలు


మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం


104 వాహనం

- వైద్యులు సమ్మెలో ఉండటమే కారణం
- హాజరుపట్టికలో మాత్రం సంతకాలు
- ఏఎన్ఎంల ఆన్‌లైన్ రిపోర్టులు కూడా బంద్

సాక్షి టాస్క్‌ఫోర్స్: గ్రామాల్లో 104 వాహన సేవలు నిలిచిపోయాయి. కందుకూరు మండలంలోని మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు వైద్యులు సమ్మెలో ఉన్నారు. దీంతో రోజుకు ఒక గ్రామానికి వెళ్లాల్సిన 104 వాహనం ఆగింది. ఆయా గ్రామాల్లోని దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వైద్యసేవల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. డాక్టర్లు లేకపోవడంతో ఉన్నతాధికారులు సేవలను పూర్తిగా ఆపేశారు. వైద్యులు లేకపోయినా ప్రతి సచివాలయం పరిధిలో ఒక విలేజ్ క్లినిక్ ఉంటుంది. అందులో ఎంఎల్‌హెచ్‌పీ, సచివాలయ ఏఎన్ఎం, 104 వాహన సిబ్బంది ఉంటారు. వారి ద్వారా కూడా మందులిచ్చే అవకాశం ఉంది. కానీ అలా జరగడం లేదు.

సంతకాలు మాత్రం పెడుతూ..

ఇదిలా ఉండగా వైద్యులు సమ్మెలో ఉంటూ కూడా విధుల్లో ఉన్నట్టు హాజరుపట్టికలో సంతకాలు చేస్తుండటం విశేషం. గత నెల 26వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లారు. అయితే విధులకు హాజరైనట్లు సంతకాలు చేసి ఉన్నారు. జీతం తీసుకునేందుకు వారే చేశారా? లేదా పీహెచ్‌సీలోని సిబ్బంది చేశారా? అనే విషయంపై అనుమానాలున్నాయి. సమ్మెలో ఉంటూ విధులకు హాజరైనట్లు సంతకాలు చేయడం నిబంధనలకు విరుద్ధం. డాక్టర్లకు సెప్టెంబర్ నెలలో పూర్తి జీతం వస్తే ఉన్నతాధికారులు కూడా పరిశీలించకుండా ఇచ్చినట్లవుతుంది. గత నెలలో ఓ ఏఎన్ఎం అనారోగ్యం కారణంగా చికిత్స పొందింది. ఆమెకు సంబంధిత జీతంతోపాటు ఎర్న్ లీవ్‌లకు సంబంధించి బిల్లులు చేయలేదు. ఆరోగ్య సమస్యతో ఇబ్బంది పడుతున్న ఉద్యోగికి జీతం పెట్టకుండా ఇబ్బంది పెడుతున్నారు. గ్రామాల్లో పనిచేసే ఏఎన్ఎంలు రోజూ ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలి. వారి చేత డాక్టర్లు నమోదు చేయించడం లేదు.

ఇబ్బంది పడుతూ..

ప్రస్తుతం సీజన్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో పీహెచ్‌సీలోని ఇద్దరు వైద్యులు సమ్మెలోకి వెళ్లడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కందుకూరు అర్బన్ పీహెచ్‌సీ నుంచి వైద్యురాలిని ఇన్‌చార్జిగా వేసినప్పటికి 104 సేవలు గ్రామాల్లో అందడం లేదు. కందుకూరు మండలంలో 19 పంచాయతీలు, 13 సచివాలయాలున్నాయి. రోజూ 104 వాహనం ద్వారా రోగులను పరీక్షించాల్సి ఉంది. కానీ దీనికి ప్రత్యామ్నాయ చర్యలు కూడా చేపట్టలేదు.

వసతుల్లేవు.. అకాడమీలా?


కాంప్లెక్స్‌లోని మైదానం ఇలా..

- కూటమి ప్రభుత్వంలో క్రీడా రంగం నిర్లక్ష్యం
- సిబ్బందికి జీతాలు ఎప్పుడిస్తారో..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వం క్రీడా రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను రూపొందించాల్సిన విధానాన్ని వదిలిపెట్టింది. ఉమ్మడి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందికి 13 నెలలపాటు జీతాలివ్వలేదు. రెండు నెలల క్రితం ఒక్కొక్కరికి నెలలో సగం జీతం మాత్రమే ఇచ్చారు. ఈ మొత్తం తీసుకుని ఏం చేయాలో అర్థం కాక తలలు పట్టుకున్నారు. రెండు నెలల క్రితం శాప్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) సమావేశం పెట్టి కాంట్రాక్ట్ సిబ్బందికి పూర్తి జీతాలిస్తామని ప్రకటించింది. అయితే ఆ రెండు నెలల నుంచి ఇంత వరకు ఆ ప్రస్తావనే లేదు. జిల్లా సంస్థలో 26 మంది కోచ్‌లు, సిబ్బంది పనిచేస్తున్నారు.

అంతంతమాత్రంగా..

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహిస్తున్న ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వసతుల్లేవు. ఆడేందుకు మైదానాలు అంతంతమాత్రంగా ఉన్నాయి. కనీసం మార్కింగ్ వేసేందుకు సున్నంకు కూడా డబ్బుల్లేవు. ప్రైవేట్ వ్యక్తుల నుంచి మార్కింగ్, తాగునీటి వసతి, లైట్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితితోపాటు జీతాలందని కోచ్‌లు, సిబ్బంది పనిచేయడమే కష్టంగా ఉంది. క్రీడాకారుల సంఖ్య బాగా తగ్గిపోయింది. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా వేసవి శిక్షణా శిబిరాలు నామమాత్రంగా జరిగాయి. క్రీడాకారులకు పరికరాల్లేవు. నగదు ప్రోత్సాహం సరిపోలేదు. ఇండోర్ స్టేడియంలో ఆడేందుకు వసతులు తక్కువే. ఫ్లోరింగ్ నుంచి స్లాబ్ వరకు అత్యంత ప్రమాదకరంగా ఉంది. స్విమ్మింగ్ పూల్లో నీటిని శుభ్రపరచడానికి కూడా వ్యయం భరించలేని పరిస్థితి నెలకొంది. వాకింగ్ ట్రాక్, హాకీ మైదానం గుంతలమయంగా తయారైంది. సిమెంట్ ఫ్లోరింగ్ ఉన్న బాస్కెట్‌బాల్ కోర్టు నిండా నెర్రెలు ఏర్పడ్డాయి. వీటిని మరమ్మతులు చేసే ప్రయత్నాలు జరగలేదు.

చిన్నచూపు చూస్తూ..

కూటమి ప్రభుత్వం కనీస వసతుల కల్పనపై దృష్టి సారించలేదు. ఇటీవల అకాడమీలను ఏర్పాటు చేస్తామంటూ శాప్ అధికారి, డైరెక్టర్ల బృందం నగరంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను పరిశీలించి హడావుడి చేశారు. అసలు ప్రభుత్వం క్రీడా రంగాన్ని చిన్నచూపు చూస్తున్న నేపథ్యంలో అకాడమీలు ఎప్పటికి ప్రారంభమవుతాయని సీనియర్ క్రీడాకారులు ప్రశ్నిస్తున్నారు. పరికరాలు, కోచింగ్ ఇచ్చే సిబ్బంది బాగోగులు పట్టించుకోకుండా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ప్రతి జిల్లాలో అకాడమీలను ఏర్పాటు చేస్తామని చెప్పడం హాస్యాస్పదమంటున్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులు

కోచ్‌ల సంఖ్య	: 5
డేటా ఎంట్రీ ఆపరేటర్లు	: 2
అకౌంటెంట్	: 1
ఆఫీస్ సబార్డినేట్	: 3
గ్రౌండ్ మార్కర్, గ్రౌండ్ మెన్, సెక్యూరిటీ	: 3
నైట్ వాచ్‌మెన్, డే వాచ్‌మెన్	: 2
ఇండోర్ స్టేడియం అటెండర్	: 2
స్విమ్మింగ్ పూల్ సెంటర్లు	: 2
స్విమ్మింగ్ పూల్ వాచ్‌మెన్‌లు	: 2
ఎలక్ట్రీషియన్	: 1
కేర్‌టేకర్ వెంకటగిరి సెంటర్	: 1
కేర్‌టేకర్ గూడూరు సబ్ సెంటర్	: 1
కేర్‌టేకర్ ఓజిలి సబ్ సెంటర్	: 1


నెల్లూరులోని క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయం


అకాడమీ ఏర్పాటుపై పరిశీలించేందుకు వచ్చిన అధికారులు (ఫైల్)

ప్రాణం తీసిన ఈత సరదా


గాలిస్తున్న పోలీసులు

- ఒకరి మృతి, మరొకరు గల్లంతు

నెల్లూరు సిటీ: ఈత సరదా ఓ యువకుడి ప్రాణం తీసింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరులోని కొత్తూరు శ్రీలంక కాలనీకి చెందిన గణేశన్ నరసింహ అలియాస్ విశాల్ (19) ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఇటీవల దేవరపాళెంలోని అమ్మమ్మ ఇంటికొచ్చాడు. నరసింహకు అదే ప్రాంతానికి చెందిన బేల్దారి పనులు చేసే కోటయ్య, విజయ్, లోకేశ్‌లు స్నేహితులు. ఆదివారం నలుగురూ ఈత కొట్టేందుకు జొన్నవాడ సమీపంలోని పెన్నానది వద్దకు వెళ్లారు. విజయ్‌కు ఈత రాకపోవడంతో దిగలేదు. అయితే లోకేశ్, కోటయ్య, నరసింహ నదిలోకి దిగారు. కోటయ్య, నరసింహకు కూడా ఈత రాదు. నదిలో వారిద్దరూ గల్లంతయ్యారు. ఇది గుర్తించిన లోకేశ్ కేకలు వేశాడు. స్థానికుల సమాచారంతో సీఐ వేణు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈతగాళ్లు వారి కోసం గాలించారు. నరసింహ మృతదేహాన్ని బయటకు తీశారు. కోటయ్య కోసం గాలించినా ప్రయోజనం లేకుండా పోయింది. రాత్రి కావడంతో గాలింపు చర్యలను నిలిపివేశారు. సోమవారం ఉదయం పరిశీలిస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఒకరు మృతిచెందడం, మరొకరు గల్లంతు కావడంతో దేవరపాళెంలో విషాదం నెలకొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


నరసింహ మృతదేహం


నరసింహ (ఫైల్)


గల్లంతైన కోటయ్య

కొందరికే 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం

- 38 వేల మంది ఉంటే 17 వేల మందికే..


మాట్లాడుతున్న నాయకులు

నెల్లూరు(వీఆర్సీ సెంటర్): కూటమి ప్రభుత్వం 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం పేరుతో మోసం చేసిందని ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, రాజా ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన ప్రతి ఒక్క డ్రైవర్‌కు రూ.30 వేల వంతున ఇవ్వాలని డిమాండ్ చేశారు. మొత్తం 38 వేల మంది ఆటో డ్రైవర్లుంటే 17,400 మందికి మాత్రమే లబ్ధి చేకూరిందని, 300 విద్యుత్ యూనిట్లు కరెంట్ బిల్లు, వాహనాలపై పెండింగ్‌లో ఉన్న పాత చలానాలు వంటి చిన్న కారణాలు చూపుతూ ఎగనామం పెట్టారన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ఆటో డ్రైవర్లు, ఇతర రవాణా రంగ కార్మికుల కుటుంబాలకు రక్షణ కల్పించే విధంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, అత్యధికంగా చలానాలు విధించే జీఓ నంబర్ 21ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఆటో కార్మిక సంఘం నాయకులు పెంచలయ్య, రవీంద్ర, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 58.460 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 58.460 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 3,600 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 430, పిన్నేరు కాలువకు 140, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.